హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.137	199	226
సూర్యాపేట	రూ.135	190	210
నల్లగొండ	రూ.136	196	223

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 । కనిష్ఠం 20.4



యాదగిరిగుట్ట ప్రధాన ఆలయం వద్ద భక్తుల రద్దీ

కరుణాసాగరా.. కరుణ చూపవా?

కరుణాసాగరా..! నీ చల్లని చూపులతోనైనా క్షేత్ర ప్రాశస్త్యం కలిగిన నిర్మాణాలకు చోటు కల్పించవా అంటూ భక్తులు ఆ దేవదేవుడిని వేడుకుంటున్నారు. మొక్కు కానుకలు లెక్కించే పరకామణి మండప నిర్మాణంలో డొల్లతనం.. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ధార్మిక, సంగీత మహాసభల వేదిక లేకపోవడం.. క్షేత్రానికి ఆద్యుడైన రుషిపుంగవుడు యాదరుషికి ఆలయం లేకపోవడం.. ఇలా ఎన్నో చారిత్రాత్మక విషయాలను ఆలయ పునర్నిర్మాణ సమయంలో అధికారులు విస్మరించారని భక్తులు ఆరోపిస్తున్నారు.

● యాదగిరిగుట్ట

- ఇరుకైన పరకామణి మండపం
- యాగశాల మండపానికి యోగం లేదా?
- ధార్మిక, సాహిత్య సభలకు కరువైన వేదిక
- యాదరుషికి చెట్టు నీడనే గతా
- ప్రహసనంగా ప్రసాదాల కొనుగోలు

యాదగిరీశుడిని దర్శించుకున్న భక్తులు తప్పనిసరిగా మొక్కుకానుకల రూపంలో హుండీల్లో నగదు, నగలను సమర్పిస్తుంటారు. సమర్పించిన కానుకలు లెక్కించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో పరకామణి మండపాన్ని నిర్మిస్తున్నామని వైటీడీఏ అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం ప్రధానాలయ ఉత్తర, దక్షిణ దిశల్లోని మొదటి ప్రాకార మండపాలను నిర్మించారు. ఇందులో ఉత్తర దిశలోని మండపంలో లిఫ్టును సైతం ఏర్పాటుచేశారు. అయితే అధికారులు అనుకున్నరీతిలో పరకామణికోసం నిర్మించామన్న మండపాలు ఇరుకుగా ఉండడంతో హుండీ లెక్కించేందుకు అనువుగా లేకపోవడంతో ఉద్ఘాటన అనంతరం ఒకటి, రెండు మాత్రమే వినియోగించారు. తర్వాత కొండపై మొదటి ఘాట్‌రోడ్‌లోని హరితాకాటేజ్, ఆ తర్వాత కొండకింద సత్యనారాయణస్వామి వ్రత మండపం హాల్‌లో పరకామణి సేవలు నిర్వహిస్తున్నారు.

ధార్మిక, సాహిత్య సభలకు కరువైన వేదిక

నిజాం కాలంనుంచి ఆలయ విస్తరణకు ముందు వరకు యాదగిరికొండపై ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభల నిర్వహణకు ప్రత్యేక వేదిక ఉండేది. ఆలయ విస్తరణలో సంగీత భవన మండపంగా పిలుచుకునే ఈ వేదిక ప్రస్తుతం కనుమరుగైంది. ఈ సంగీత మండపంలో ఎందరో వాగ్గేయకారులు, కళాకారులు, పండితులు తమ ప్రదర్శనలతో క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తుల్లో ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదాన్ని పెంపొందించారు. తొలిరోజుల్లో ప్రధానాలయ ప్రవేశ ద్వారం పక్కన ఉన్న బంకర్‌లో భజనలు, హరికథా కాలక్షేపాలు కొనసాగేవి. ఆ తర్వాత ఆలయంతోపాటు జరిగిన అభివృద్ధిలో భాగంగా ప్రధానాలయానికి అభిముఖంగా సంగీత భవన మండపాన్ని అధికారులు నిర్మించారు. సుమారు 170 ఏళ్లక్రితం బాపట్ల లక్ష్మీకాంతయ్య అనే భక్తుడు మహోత్సవాల సమయంలో ధార్మిక సాహిత్య, సంగీత మహాసభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి ఆలయ విస్తరణ వరకు ఉత్సవాల సమయంలో ధార్మిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది. కాగా ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండపైన ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు వేదికను నిర్మిస్తామని చెప్పిన అధికారులు ఉద్ఘాటన జరిగాక కూడా మరిచిపోయారు. ఉద్ఘాటన జరిగి రెండేళ్లు కావస్తున్నా ధార్మిక, మహాసభల కోసం శాశ్వత నిర్మాణం గురించి అధికారులు ఆలోచించడం లేదని, ఇకనైనా సంగీత భవన మండపం నిర్మించాలని కోరుతున్నారు.



బ్రహ్మోత్సవ కల్యాణ మండపంపై వేడుక సాగేనా?

లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవాన్ని వీక్షించి తరించడానికి దేశవిదేశాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తుంటారు. కొండపైన తూర్పు తిరువీధిలో కృష్ణరాతి శిలలతో బ్రహ్మోత్సవ మండపం పేరిట మండపాన్ని వైటీడీఏ నిర్మించింది. అయితే ఉద్ఘాటనకు ముందే శ్రీవైష్ణవ పండితుల్లో తూర్పు-దక్షిణ దిశలో నిర్మించిన ఈ మండపం వాస్తు ప్రకారం సరైంది కాదనే వాదనలతో అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. విమర్శలు వినిపిస్తున్నా అధికారులు మాత్రం బ్రహ్మోత్సవ మండపంపైనే ఉద్ఘాటన అనంతరం తొలిసారి బ్రహ్మోత్సవ తిరుకల్యాణాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా మరి ఈ సంవత్సరం రానున్న రెండో వార్షిక బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవం బ్రహ్మోత్సవ మండపంపై నిర్వహించేందుకు అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. శ్రీవైష్ణవ, ఆగమ పండితులు అప్పట్లో ఆక్షేపణ చెప్పిన విధంగా ఈ సంవత్సరం చెబితే బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగేనా? అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఆలయ విస్తరణకు ముందు కొండపై తూర్పు తిరువీధిలోని కల్యాణమండపంలో ప్రతీ సంవత్సరం వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో జగద్రక్షకుడు నారసింహుడు, సౌభాగ్యవతి మహాలక్ష్మీ అమ్మవార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగేది.

విస్మరించిన యాగశాల నిర్మాణం

ప్రధానాలయంలో నిత్య యాగశాల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించినట్లు తెలుస్తోంది. గతంలో ప్రధానాలయంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆనుకొని ఉన్న మండపంలో స్నపన తిరుమంజనాలతో హోమ పూజలు చేసేవారు. తర్వాత ప్రధానాలయంలో, మరి కొంతకాలానికి ప్రధానాలయ దక్షిణ దిశలో కల్యాణమండపంలో యాగశాల ఏర్పాట్లు ఉండేవి. ప్రస్తుతం ఉత్తర దిశలో తాత్కాలిక ఏర్పాట్లతో సరిపెట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



యాదగిరీశా శరణు 4



యాదరుషికి ఆలయమేదీ?

జంతువులు, విషసర్పాలు సంచరించే దట్టమైన కీకారణ్యంతో కూడిన కొండగుహను ఆవాసంగా చేసుకుని విభాండక మహర్షి కుమారుడు యాదరుషి లక్ష్మీనారసింహుడి సాక్షాత్కారంకోసం తపస్సు చేసినట్లు స్కంద పురాణం వివరిస్తుంది. యాదరుషి తపస్సు ఫలితంగానే ఈ కొండకు యాదగిరికొండగా నామకరణంతోపాటు స్వయంభు లక్ష్మీ సమేతుడై నారసింహుడు పంచరూపాల్లో అవతరించి భక్తులను కటాక్షిస్తున్నట్లు స్థల పురాణం చెబుతోంది. సాక్షాత్తు ఓ మహాపుణ్యక్షేత్ర ఆవిర్భావానికి కారణమైన రుషిపుంగవుడు యాదరుషికి సైతం కొండపైన ఎలాంటి ఆవాసం లేకపోవడం శోచనీయమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి ముందు కొండకింద తులసీకాటేజ్‌లోని మర్రిచెట్టు వద్ద యాదరుషి విగ్రహం ఉండేది. కొండకింద రహదారి విస్తరణలో భాగంగా మర్రిచెట్టు, యాదరుషి విగ్రహాన్ని తొలగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయడంతో హిందుత్వ సంఘాల నుంచి తీవ్రస్థాయిలో నిసనలు వెల్లువెత్తాయి. దీంతో తేరుకున్న అధికారులు కొండపైన విష్ణుపుష్కరిణి వద్దనున్న యాదరుషి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించి చేతులు దులుపుకున్నారు. యాదగిరిక్షేత్రానికి ఆద్యుడు అత్యంత తపో సంపన్నుడైన యాదరుషికి ఆలయం కాని, స్థల పురాణం తెలిపే ఏర్పాట్లు అధికారులు నేటికీ చేయలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

సరిగాలేని ప్రసాద విక్రయశాల కౌంటర్లు

యాదగిరికొండపైన దేవదేవుడి దర్శనానంతరం ప్రసాదాలు కొనుగోలు చేద్దామన్నా అదో ప్రహసనంగా మారిందని భక్తులు అంటున్నారు. వైటీడీఏ అధికారులు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన స్వామివారి ప్రసాదాల విక్రయశాల కౌంటర్లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఒకరిని ఒకరు తోసుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా సెంట్రల్ ఏసీతో నిర్మించిన ప్రసాదాల తయారీ భవనంలో ఏసీలు పనిచేయకపోవడంతోపాటు సరైన వెంటిలేషన్ లేక పోవడంతో కరెంటు పోయినప్పుడు భక్తులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ అధికంగా ఉన్న సందర్భాల్లో ప్రసాద విక్రయశాఖ కౌంటర్ సిబ్బందితో భక్తులు వాగ్వాదాలకు దిగుతున్నారు. ప్రసాదాల విక్రయశాలలో తయారీ సిబ్బంది, ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు కౌంటర్ల వద్దకు భక్తులు వెళ్లేందుకు, వచ్చేందుకు ఒకే మార్గం ఉండడంతో అనేక పర్యాయాలు తోపులాటలు, వాగ్వాదాలు జరుగుతున్నాయి.

అద్దాల మండపం ఆర్జిత సేవలకేనా?



ప్రాకార మండపంలో అద్దాల మండపం (ఫైల్)

యాదగిరికొండను సందర్శించే భక్తులు స్వామివారి అవతార విశేషాలు, క్షేత్ర మహాత్మ్యాన్ని తెలిపే చిత్రపటాలను మండపంలోని అద్దాల్లో వీక్షించి తరించే విధంగా ఏర్పాట్లు ఉండేవి. దీంతో ఆలయాన్ని సందర్శించిన అనంతరం భక్తులు అద్దాల మండపాన్ని సైతం పిల్లాపాపలతో కలిసి దర్శించేవారు. అయితే కాలక్రమేణా అద్దాల మండపం శిథిలావస్థకు చేరగా తొలగించిన అధికారులు దాత సాయంతో ప్రధానాలయానికి ముందు వైపు నిర్మించగా, దానిని ఆలయ అభివృద్ధిలో భాగంగా తొలగించారు. తాజాగా ఆలయ పునర్నిర్మాణంలో ప్రధానాలయ అష్టభుజి పడమటి వాయువ్యదిశలో దాతల సహకారంతో అద్దాల మండపాన్ని నిర్మించారు. స్వర్ణశోభితంగా తీర్చిదిద్దిన ఈ అద్దాల మండపా న్ని భక్తులు వీక్షించే విధంగా ఏర్పాట్లు ఉంటాయని మాజీ సీఎం కేసీఆర్ ఆలయ ఉద్ఘాటన సమయంలో ప్రకటించిన సంగతి విదితమే. అయితే ఈ అద్దాల మండపంలో ప్రతీ శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవంతోపాటు విశేష పర్వదినాల్లో స్వామివారి కైంకర్యాల నిర్వహణకు మాత్రమే వినియోగిస్తున్నారు. ఇకనైనా అద్దాల మండపాన్ని సామాన్య భక్తులు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆంజనేయుడికి ఆస్థాన పరంగానే అర్చనలా

ప్రధానాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నేటికీ ఆర్జితసేవల్లో నిత్య సహస్రనామార్చనలు మినహా మిగిలిన కైంకర్యాలు ఆస్థానపరంగానే సాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణానికి ముందు ప్రధానాలయంలోని ఆంజనేయస్వామి సన్నిధిలోనే ప్రతీ మంగళవారం ఆకుపూజ వేడుకలు నిర్వహించేవారు. ప్రధానాలయంలోని ఆంజనేయుడి సన్నిధిలో కొనసాగే అన్ని వేడుకల్లో భక్తులు పాల్గొనే అవకాశం ఉండేది. ఉద్ఘాటన తర్వాత ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం జరిగే ఆంజనేయస్వామి సహస్రనామార్చన కైంకర్యం టికెట్ పొందిన భక్తులు ముఖమండపంలో నుంచే ఈ సేవల్లో పాల్గొంటున్నారు. ప్రధానాలయ ఉద్ఘాటన జరిగి దాదాపు రెండేళ్లు కావస్తున్నా కొండపైన విష్ణుపుష్కరిణి వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయం ఏమాత్రం అభివృద్ధికి నోచలేదు.

దర్శన క్యూలైన్‌తో తప్పని బాధలు

యాదగిరిక్షేత్రంలో దర్శన క్యూకాంప్లెక్స్, బంగారు లోహ క్యూలైన్ బాక్సులు, ప్రధాన ఆలయ క్యూలైన్లలో గంటల తరబడి నడవలేక ఇబ్బందులుపడుతున్నారు. నాలుగు అంతస్తుల దర్శన క్యూకాంప్లెక్స్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడంతోపాటు నాలుగు అంతస్థుల్లోని ర్యాంపు గుండా పైకి చేరుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఇక ప్రధానాలయ తూర్పు రాజగోపురం ముందున్న బంగారు లోహపు దర్శన క్యూలైన్ల బాక్సుల్లోకి చేరుకున్న భక్తులు చలికాలంలో చలితో, వర్షాకాలం వర్షపు జల్లుతో, వేసవి కాలంలో వడగాలులు తదితర వాతావరణ ప్రభావాలతో క్యూలైన్ బాక్సుల్లో ఎక్కువ సేపు నడవలేని పరిస్థితి. అక్కడ నుంచి అష్టభుజి ప్రాకార మండపం గుండా తూర్పు పంచతల రాజగోపురం, ఈశాన్య త్రితల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోనికి రద్దీ ఉన్నా లేకున్నా నడవాల్సి వస్తుండడంతో భక్తులు మండిపడుతున్నారు.

శ్రీవారి పాదాలకు మరో ఆలయమా?

యాదగిరిగుట్టకు వచ్చే భక్తులు తప్పనిసరిగా దర్శించుకునే మరో ముఖ్యమైన, పరమ పవిత్రమైన పుణ్యస్థలం స్వామివారి నిజపాదాల ఆలయం. ఈ ఆలయం కొండకింద పాత గోశాలను ఆనుకుని ఏకశిలపై స్వామివారి పాదాల గుర్తులు ఉంటాయి. వీటిని దర్శించుకుంటే సాక్షాత్తు స్వామివారిని దర్శించుకున్నట్టేనని భక్తుల నమ్మకం. అంతటి మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని ఆలయ విస్తరణలో భాగంగా డ్రైన్‌లైన్‌కు అడ్డుగా ఉందని తొలగించాలని అధికారులు నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా పక్కనే మరో ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఉద్ఘాటనకు ముందు 2022లో మహిమాన్విత ఆలయాన్ని తొలగించేందుకు అధికారులు యత్నించగా.. హిందుత్వ సంఘాలు, భక్తులు, స్థానికులు ఆందోళనలు తెలపడంతో నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. ఈ పాదాల ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు మాత్రం అడుగులు వేయలేదు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగదీ‌ష్‌రెడ్డి

కేసీఆర్‌ను ముట్టుకోవడం ఎవరితరం కాదు

ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి

తుంగతుర్తి,ఫిబ్రవరి7 : కేసీఆర్‌ను ముట్టుకోవడం ఎవరితరం కాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో భాగంగా బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనా అనుభవ రాహిత్యంతో కృష్ణానదిపై ఉన్న హక్కులను కేంద్రప్రభుత్వ ఒత్తిడితో కేఆర్ఎంబీకి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అప్పగించారని ఎద్దేవా చేశారు. నాడు తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్ నేడు తెలంగాణ హక్కుల కోసం పోరాటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈనెల 13న నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం జరిగింది నీళ్ల, నియామకాల కోసమని మళ్లీ నీళ్ల కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తేవడానికి కేసీఆర్ తలవంచలేదని, అవసరమైతే ప్రభుత్వాన్ని రద్దు చేస్తాం కానీ ప్రాజెక్టులను వదులుకోలేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలను పెంచామన్నారు. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. నల్లగొండలో జరిగే సభను కొందరు అడ్డుకుంటామని ప్రకటనలు చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమా ర్, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలు చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాల్సి న బాధ్యత ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్ల పెంపు, రూ.2లక్షల రుణమాఫీ, గృహఅవసరాలకు ఉచిత విద్యుత్ ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీ‌ప్‌రె డ్డి, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రవీందర్‌సింగ్, కంచర్ల రామకృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, రజాక్, తాటికొండ సీతయ్య, గుడిపాటి సైదులు, కవితరాములుగౌడ్, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

నైతికహక్కు కోల్పోయిన కేసీఆర్:టీజేఎస్

సూర్యాపేటటౌన్: కృష్ణాజలాల గురించి మాట్లాడే కనీస నైతిక హక్కును మాజీ సీఎం కేసీఆర్ కోల్పోయారని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. ఈ నెల 11వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా - కేంద్ర ప్రభుత్వ వివక్ష, బీఆర్ఎస్ నిర్లక్ష్యం - దగా పడ్డ నల్లగొండ ' సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి, మాట్లాడారు. తెలంగాణ పోరాటమంతా నీళ్ల కోసమేనని తెలంగాణ సాధించుకున్నా బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటా రాకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందన్నారు. రాష్ట్ర విభజన హామీల మేరకైనా కృష్ణాజలాలు ఇవ్వకుండా కేంద్రం గుత్తాధిపత్యాన్ని చెలాయించేలా గెజిట్ తెస్తే కేసీఆర్ మౌనంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, నారబోయిన కిరణ్‌కుమార్, సూర్యనారాయణ, బొడ్డు శంకర్‌గౌడ్, బొమ్మగాని వినయ్ గౌడ్, సుమన్‌నాయక్, రాజు, సతీష్, మల్సూర్‌నాయక్, సతీష్, గోపి, స్వామి పాల్గొన్నారు.

దవాఖానాలపై పేదలకు నమ్మకం పెంచాలి

● **వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**



కోదాడ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమ సభలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన మంత్రులు ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావు

హుజూర్‌నగర్,/ కోదాడ రూరల్, ఫిబ్రవరి 7 : సర్కారు దవాఖానాలపై పేదలకు నమ్మకం, విశ్వాసం పెంచాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం కోదాడ, హుజూర్‌నగర్‌లలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పర్యటించారు. కోదాడలో రూ.26 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం హుజూర్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రిని పరిశీలించి, రాష్ట్ర స్థాయి వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ అన్నిరకాల వ్యాధులకు ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రస్తుతం 1,800 రకాల రోగాలకు ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సేవలు పెంచామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌కు కట్టుబడి ఉందని అన్నారు. సూర్యాపేటలో పీజీ కళాశాల పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మెడికల్ కళాశాలలోని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో 35 డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. హుజూర్‌నగర్ ఆసుపత్రికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వెంటనే ఏ పనికి ఎన్ని నిధులు కావాలో, ఏ భవనాలు కట్టించాలో నిర్ణయించి అంచనాలు వేసి ప్రభుత్వానికి వెంటనే నివేదిక పంపించాలని కలెక్టర్ వెంకటరావును ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో ముందుంచుతున్నారని అన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధికి ఉత్తమ్, పద్మావతి విశేష కృషి : మంత్రి తుమ్మల

మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యేగా పద్మావతిరెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానన్నారు. గతంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రిగా ఎడమ కాల్వపై ఎత్తిపోతల పథకాలను మంజూరు చేశామన్నారు. దీంతో వేలాది ఎకరాల భూములు సాగులోకి వచ్చాయన్నారు. అదేవిధంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో రోడ్లను నిర్మించామన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్అండ్‌బీకి అనేక రోడ్లను బదలాయించామన్నారు. కోదాడలో 100 పడకల ఆసుపత్రితో పేదలకు ఉచితంగా వైద్యం అందుతుందని, ఇందుకు ఉత్తమ్ కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ పనిచేసిన ఎమ్మెల్యేపై వ్యతిరేకతతో పద్మావతి భారీమెజార్టీతో విజయం సాధించారన్నారు. ఆయా కార్యక్రమాల్లో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, హెల్త్ సెక్రటరీ క్రిస్టియానా, హెల్త్ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్, కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంక, డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, వైద్యులు కరుణ్, మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, భూక్యా గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం : మంత్రి ఉత్తమ్

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ ఆసుపత్రిలో మౌలికవసతుల కల్పనకు వెంటనే నివేదిక అందజేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలికవసతులకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై రూ.45 కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయబోతున్నామని, త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తారన్నారు. శాంతినగర్ వద్ద ఉన్న ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరిందని, దాని మరమ్మతులకు రూ.5 కోట్లు మంజూరు చేయించామన్నారు. కోదాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉపాధి పథకం కింద రూ.12 కోట్లు, సీఎం అభివృద్ధి నిధుల నుంచి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు భద్రతా ఉత్సవాల ముగింపు సభలో జ్యోతి ప్రజల్వ చేస్తున్న బాబురావు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 7: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కోదాడ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ బాబురావు అ న్నారు. మండలకేంద్రంలోని మైహోం సిమెంట్ ఆధ్వర్యంలో బుధవారం 35వ జాతీయ భద్రతా ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ శ్రీనివాస్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ దేశ గణాంకాల ప్రకారం ఏడాదికి కోటి 60 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని తెలిపారు. మైహోం సిమెంట్ కంపెనీలో రోడ్డు భద్రతా ప్రమాణాలపై తీసుకున్న చర్యలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జీయం నాగేశ్వరరావు, సేఫ్టీ హెడ్ సూర్యనారాయణ, నరేందర్, ఏజీయం శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మండలంలోని చౌటపల్లి ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మై హోం పరిశ్రమ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి వేణు, హెచ్ఎం సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 7 : నల్లగొండ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి, కేంద్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ శ్రేణులు కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమీక్ష సమావేశానికి ఆమె మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో అవకాశం కల్పిస్తున్నామని గొప్పలు చెబుతోందన్నారు. నిరంతరం మహిళలపై వేధింపులు జరుగుతున్నా గతంలో పట్టించుకోని బీఆర్ఎస్, బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. యుద్ధప్రాతిపదికన అన్ని కమిటీలను పూర్తి స్థాయిలో నియమించి క్షేత్రస్థాయిలో మహిళా కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో పాటు మహిళల అభివృద్ధి కోసం పెద్దపీట వేస్తోందన్నారు. మహి ళా మేనిఫెస్టో గురించి మహిళల అభిప్రాయాలను సేకరిం చి, రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మహిళలు అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని సునీతారావు పార్టీ అధినాయకత్వాన్ని కోరారు. కార్పొరేషన్ నియామకాల్లో మహిళా కాంగ్రెస్ శ్రేణులకు అధిక సంఖ్యలో కేటాయించాలన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ నీ లం పద్మ, స్టేట్ జనరల్ సెక్రటరీ సుకన్య, జిల్లా అధ్యక్షురా లు గోపగాని పద్మ, జిల్లా జనరల్ సెక్రటరీ దుబ్బ రూప, ఎగ్గిడి సుజాత, సురెడ్డి సరస్వతి, పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, లలితా పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యవిధి కైంకర్యాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 7: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా అలంకారమూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాభిషేకం చేసి తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,03,141 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.



లక్ష్మీనృసింహుల నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సమగ్ర చేనేత పాలసీ రూపొందించాలి : చేనేత కార్మిక సంఘం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 7: చేనేత పాలసీని సమగ్రంగా రూపొందించి సహకార సంఘాల్లో నిల్వ చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. యాదాద్రిభువనగిరి కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు జెండగేకు సంఘం సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేస్తున్న మాదిరిగానే చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలన్నారు. సహకార సంఘాల ఎన్నికలు జరిపించి టెస్కో పాలకవర్గాన్ని నియమించి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు కేటాయించాలన్నారు. బీమా పథకంలో వయో పరిమితి మినహాయించి అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం నర్సింహ, ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, బోడ ఆంజనేయులు, గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం పాయింట్
Crime point

గంజాయి ప్యాకెట్లతో దొరికిన యువకులు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 7: తక్కువ ధరకు గంజాయి తెచ్చి ఎక్కువ ధరకు విక్రయించొచ్చని గంజాయి ప్యాకెట్లు తీసుకొస్తున్న నలుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ సతీష్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన గాజుల రాజు, గాజుల వంశీ, దుర్గానగర్‌కు చెందిన కస్నెబోయిన జ్ఞానేశ్వర్, మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడేనికి చెందిన జి. సాయి శ్రీరామ్ అనే నలుగురు యువకులు ముఠాగా ఏర్పడ్డారు. బీహార్‌కు చెందిన వ్యక్తి వద్ద తక్కువ ధరకు 25గ్రాముల 50గంజాయి ప్యాకెట్లు తీసుకొని వెంకటాద్రిపాలెం గ్రామ శివారులోని రైల్వేస్టేషన్ సమీపం నుంచి రెండు బైక్‌లపై మిర్యాలగూడ పట్టణానికి వస్తున్నారు. పోలీసులు బైక్‌లను తనిఖీ చేయగా వారి వద్ద 25గ్రాముల గంజాయి రెండు ప్యాకెట్లు దొరకడంతో వారి నుంచి ఆ గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. బీహార్‌కు చెందిన యువకుల నుంచి తక్కువ ధరలకు తీసుకున్నట్లు విచారణలో వెల్లడించారు. కేసు నమోదు చేసి మిర్యాలగూడ కోర్టులో హాజరు పరచడంతో రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

శాలిగౌరారం, ఫిబ్రవరి 7: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన జక్కులి పాపయ్య ఇంట్లో మంగళవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వచ్చి రెండు గదులు పూర్తిగా దగ్ధమయ్యాయి. నిత్యావసర వస్తువులతో పాటు టీవీ, బీరువా, దుస్తులు, దగ్ధమైయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే శాలిగౌరారం సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఇరుగు పొరుగు ఇళ్ల వారు నీటితో మంటలు చల్లార్చారు. అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు కాలి పోయాయి. సుమారు రూ.లక్షన్నర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

పిచ్చి కుక్కదాడిలో బాలుడికి గాయాలు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 7: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో పిచ్చికుక్క దాడిలో నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన కాసాని పాండు, పద్మల కుమారుడు కాసాల ప్రణయ్ ఆరుబయట ఆడుతుండడంతో పిచ్చికుక్క అతడిపై ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కుక్కను అక్కడి నుంచి తరిమి వేసి చంపివేశారు. అతడిని చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

భువనగిరిలో తప్పిపోయిన నిజామాబాద్ బాలుడు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 7: నిజామాబాద్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు భువనగిరిలో తప్పిపోయాడు. ఈ ఘటన బుధవారం వెలుగు చూసింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రాతలారంరెడ్డి గ్రామానికి చెందిన బైండ్ల చిన్న రాజు తన కుటుంబంతో కలిసి ఉపాధి కోసం ఈ నెల 4వ తేదీ రాత్రికి భువనగిరికి వచ్చారు. ప్రయాణంతో అలసిపోయి బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ దుకాణం ఎదురుగా నిద్రించారు. మరుసటి రోజు తెల్లవారుజామున నిద్రలేచే సరికి ఆరేళ్ల కుమారుడు సిద్దిరాములు కన్పించలేదు. దీంతో కుటుంబ సభ్యులందరూ కలిసి బస్టాండ్ పరిసరాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బుధవారం భువనగిరి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాలుడి తల్లి బైండ్ల రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. కాగా 5వ తేదీన తెల్లవారుజామున నిద్రలేచిన సిద్దిరాములు బస్టాండ్‌లోకి వచ్చినట్లు సీసీ కెమెరా ఫూటేజీలలో రికార్డైంది. కానీ బస్టాండ్‌లో మాత్రం అతని ఆచూకీ తెలియరాలేదు. తప్పిపోయినబాలుడు మూడు అడుగుల ఎత్తు, తెలుపు రంగు చొక్కా నీలిరంగు పాయింట్ ధరించి ఉన్నట్లు ఆచూకీ లభించిన వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

విద్యార్థినుల ఆత్మహత్యపై దర్యాప్తు ముమ్మరం

● నిజానిజాలను తేల్చే పనిలో అధికారులు
● హాస్టల్‌ను వీడి ఇంటికి వెళ్లిన 110మంది విద్యార్థినులకు ప్రత్యామ్నయంగా ఇతర హాస్టళ్లు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 7: యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో విద్యార్థినుల ఆత్మహత్య మిస్టరీని తేల్చేందుకు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. భువనగిరి ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో భవ్యశ్రీ, వైష్ణవి ఈ నెల 3వ తేదీన ఆత్మహత్య చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నిజానిజాలను తేల్చాలని మంత్రి సీతక్క ఆదేశించడంతో మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్(స్కీమ్స్) కేఆర్ఎస్ లక్ష్మీదేవిని ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయం నుంచి బుధవారం దర్యాప్తును ప్రారంభించారు. ఆత్మహత్యలకు ముందు హాస్టల్, ఆ విద్యార్థినులు చదువుకుంటున్న పాఠశాలలో నెలకొన్న సంఘటనలు, భవ్యశ్రీ, వైష్ణవి నేపథ్యం తదితర వివరాలను అందించాలని జిల్లా అధికారులను కోరారు. ఆత్మహత్యకు కారణమని ప్రచారం అవుతున్న కౌన్సిలింగ్, హాస్టల్ నిర్వహణలో ఆటో డ్రైవర్ ప్రమేయంతోపాటు విద్యార్థినులకు కౌన్సిలింగ్ చేయాల్సి వచ్చిన కారణాలు, హాస్టల్‌లోని విద్యార్థుల మధ్య ఉన్న విభేదాలు, సమన్వయం తదితర సమగ్ర వివరాలను సేకరించారని జిల్లా అధికారులకు విచారణ అధికారి సూచించినట్లు తెలుస్తోంది. అలాగే హాస్టల్ నిర్వహణ, వార్డెన్ శైలజ విధుల నిర్వహణ, ఇతర సిబ్బంది కార్యకలాపాలపై నివేదిక రూపొందించాలని కోరినట్లు సమాచారం. అలాగే జిల్లా కలెక్టర్ హనుమంత్ కే. జెండగే, డీసీపీ రాజేష్‌చంద్ర ప్రతిరోజూ పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. హాస్టల్ ప్రాంగణంలో భద్రతను భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థినుల్లో ఆత్మన్యూనతా భావం

నిజ నిర్ధారణ పేరిట హాస్టల్‌ను పలు సంఘాల ప్రతినిధులు సందర్శిస్తున్నారు. వీరి ప్రకటనలతో హాస్టల్‌ను వీడి ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు, జరుగుతున్న ప్రచారంపై ఆత్మన్యూనతా భావానికి గురవుతున్నట్లు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.


ఎస్సీ హాస్టల్, భద్రత పర్యవేక్షిస్తున్న ఇన్‌స్పెక్టర్

ఇద్దరు ఆత్మహత్యల ఉదంతంపై ఏమైనా అనుమానాలుంటే అధికారులకు నేరుగా ఫిర్యాదు లేదా సమాచారం రూపంలో తెలియజేయాలని సూచిస్తున్నారు. పోస్టుమార్టం ప్రాథమిక రిపోర్టు ఈపాటికే పోలీసుల చేతికి అందగా, త్వరలో ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి సూసైడ్ నోట్, పోస్టుమార్టం రిపోర్టులు రానున్నాయని, ఆ రిపోర్టుల ఆధారంగానే దర్యాప్తు సాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. హాస్టల్ వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా క్లూస్‌టీం ఇప్పటికే విద్యార్థినుల ఆత్మహత్య చేసుకున్న గదిలో పలు ఆధారాలను సేకరించింది.

ఆరుగురి నుంచి వివరాలు సేకరించిన అధికారులు

భవ్యశ్రీ, వైష్ణవి తల్లిదండ్రుల ఫిర్యాదుల మేరకు హాస్టల్ వార్డెన్ శైలజ, పీఈటీ ప్రతిభ, ట్యూటర్ భువనేశ్వరి, ఆటో డ్రైవర్ ఆంజనేయులు, వంట సిబ్బంది సుజాత, ఇటీవల బదిలీపై వెళ్లిన మహిళా నైట్ వాచ్‌మెన్‌ను అధికారులు విచారించి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఇద్దరు విద్యార్థినులకు ఎందుకు కౌన్సిలింగ్ చేయాల్సి వచ్చింది, కౌన్సిలింగ్‌లో ఏమి మాట్లాడారు, హాస్టల్‌లో విద్యార్థినుల ప్రవర్తన తీరు, విద్యార్థినుల మధ్య నెలకొన్న విభేదాలు, తదితర అంశాలపై ఆ ఆరుగురిని అడిగినట్లు, హాస్టల్ నిర్వహణలో ఆటో డ్రైవర్ ఆంజనేయులు పాత్రపై ఆరా తీసినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణాధికారి లక్ష్మీదేవి ఒకట్రెండు రోజుల్లో హాస్టల్‌ను సందర్శించనున్నట్లు సమాచారం. వార్డెన్ శైలజను కలెక్టర్ సస్పెండ్ చేసిన నేపథ్యంలో స్థానిక ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ వార్డెన్ చంద్రకళకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థినులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్య చేసుకున్న ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి చదువుతున్న 112మంది బాలికలు ఉన్నారు. వీరిలో ఇద్దరి ఆత్మహత్యతో భయపడిన మిగతా 110మంది విద్యార్థినులు హాస్టల్‌ను వీడి ఇంటికి వెళ్లారు. తిరిగి హాస్టల్‌కు వెళ్లేది లేదని విద్యార్థినులు పేర్కొంటున్నారు. దీంతో ఆ 110మంది బాలికలను ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే వరకు ఇతర వసతిగృహాల్లో సర్దుబాటుచేసి యథావిధిగా చదువు కొనసాగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 16మంది 10వ తరగతి విద్యార్థినులను స్థానిక ఎస్సీ బాలికల గురుకులంలో చేర్పించి అక్కడే తరగతుల నిర్వహణ కొనసాగించనున్నారు. మిగతా వేర్వేరు తరగతులకు చెందిన 84మంది బాలికలను స్థానిక బాలికల హాస్టల్‌లో చేర్పించనున్నారు. ఈ మేరకు జిల్లా సాంఘిక సంక్షేమ ఈడీ శ్యాంసుందర్, ఏఎస్‌వోడబ్ల్యూ డీకే వసంతకుమారి, ఇన్‌చార్జీ వార్డెన్ చంద్రకళ బుధవారం హాస్టల్‌ను సందర్శించి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రిజిస్టర్ ఆధారంగా ఇంటి వద్ద ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి చేరాల్సిన హాస్టల్ వివరాలను వెల్లడిస్తున్నారు. అలాగే హాస్టల్‌లో చేరిన విద్యార్థులందరికీ త్వరలో కౌన్సిలింగ్ చేయాలని అధికారులు నిర్ణయించారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు వద్దు : రాజేష్‌చంద్ర, డీసీపీ

భువనగిరి హాస్టల్ విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు పెట్టవద్దని రాచకొండ పోలీస్ కమిషనరేట్ యాదాద్రి జోన్ డీసీపీ ఎం.రాజేశ్ చంద్ర సూచించారు. బుధవారం భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్య బాధాకరమని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిందని, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు రాగానే దర్యాప్తును ముమ్మరంచేసి దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంతో హాస్టల్ విద్యార్థినుల మనోభావాలకు ఆటంకం కలగనుందని, పోస్టింగ్‌లు పెట్టే వారు విచక్షణ చూపాలన్నారు.

త్రిపురారం సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

● ముకుందాపురం ఫీడర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతం ● జూనియర్ లైన్‌మన్, మీటర్ రీడింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగికి గాయాలు

త్రిపురారం, ఫిబ్రవరి 7: నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పెను ప్రమాదం తప్పింది. బుధవారం సబ్‌స్టేషన్‌లో ఫీడర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఇద్దరు ఉద్యోగులు గాయపడ్డారు. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురారం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నిడమనూరు మండలం ముకుందాపురం వెళ్లే ఫీడర్ మరమ్మతులకు గురైంది. ఆ ఫీడర్ త్రిపురారం సబ్‌స్టేషన్‌లోనే ఉంది. ముకుందాపురం ప్రాంతానికి చెందిన జూనియర్ లైన్‌మన్ ముడి నాగయ్య, మీటర్ రీడర్ సఫావత్ అశోక్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఫీడర్ మరమ్మతులు చేయడానికి ఆపరేటర్ నుంచి ఎల్‌సీ తీసుకున్నారు. ఆరు అడుగుల ఫీడర్‌పైన అశోక్, మధ్యలో నాగయ్య మరమ్మతులు చేస్తుండగా ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై సరఫరా నిలిచింది. ఈ ఘటనలో కూర్చున్న ప్రదేశంలోనే అశోక్ ఒరిగిపోయాడు. ఫీడర్‌పై ఉన్న ఇద్దరు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న ఇతర సిబ్బంది వారిని నల్లగొండకు, మిర్యాలగూడ ఆసుపత్రులకు తరలించారు. ఆ ఫీడర్‌కు వచ్చే విద్యుత్ సరఫరాను సబ్‌స్టేషన్ ఆపరేటర్ నిలిపివేయక పోవడంతో ప్రమాదం జరిగింది. బాధితుడు నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆపరేటర్ శ్రీనివాస్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


విద్యుదాఘాతంతో గాయపడిన సిబ్బంది

అమ్మకు బాగాలేదు.. చూద్దురు రండి

● మద్యం మత్తులో తల్లిని చంపిన కుమారుడు ● మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లాలో ఘటన

అనంతగిరి, ఫిబ్రవరి 7: మద్యం మత్తులో హత్య చేసిన తనయుడు 'అమ్మకు బాగా లేదు, చూద్దురు రండి' అని చుట్టుపక్కల వారిని పిలిచాడు. అప్పటికే ఆమె మృతి చెందింది. రాత్రి కావడంతో గుర్తుపట్టని స్థానికులు, తెల్లవారిన తర్వాత కమిలిన గాయాలను చూసి నిలదీయడంతో మద్యం మత్తులో తల్లిని హత్య చేసినట్లు అంగీకరించాడు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి మండలం తమ్మరబండపాలెం గ్రామంలో సుందరయ్యకాలనీకి చెందిన పుట్టపర్తి నాగభూషణం, రాములమ్మ(70) దంపతులకు కుమారుడు వీరేశం, కుమార్తె రమణ ఉన్నారు. వీరిద్దరికి పెళ్లిళ్లు కాగా నాగభూషణం కొన్నేళ్ల కిందట మృతి చెందాడు. తాపీపనిచేస్తూ జీవనం సాగించే వీరేశం ఇటీవల మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో భార్య శిరీష అతడిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తల్లి రాములమ్మతో కలిసి తమ్మరబండపాలెంలో కిరాయి ఇంట్లో నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి తాగి వచ్చిన వీరేశం తల్లితో గొడవపడి, ఆమె గొంతునులిపి చంపేశాడు. అనంతరం అమ్మకు బాగా లేదు, చూద్దురు రండి అని చుట్టుపక్కల వారిని పిలిచాడు. వారు వచ్చి ఆమె చనిపోయిందని నిర్ధారించుకుని కుమార్తె, బంధువులకు సమాచారమిచ్చారు. బుధవారం ఉదయం బంధువులు రాములమ్మ మెడపై గాయాలను గుర్తించి వీరేశంను నిలదీయడంతో మద్యం మత్తులో చంపినట్లు అంగీకరించాడు. రాములమ్మ కుమార్తె రమణ ఫిర్యాదు మేరకు రాములమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు. అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉండటంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోలేదు.


రాములమ్మ మృతదేహం

నెంబర్‌లేని వాహనాలపై కఠిన చర్యలు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 7: నెంబర్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రిభువనగిరి జిల్లా డీసీపీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. భువనగిరిలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైన్ స్నాచింగ్, దొంగతనాలు కిడ్నాప్‌లు తదితర అసాంఘిక కార్యకలాపాలకు నిందితులు నెంబర్ లేని వాహనాలను వినియోగిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలుతున్నదన్నారు. దీంతో నెంబర్ లేని వాహనాలు, వినియోగించేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారందరూ విధంగా హెల్మెట్ ధరించాలని వాహనదారులందరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ మేరకు పలు వాహనదారులకు జరిమానాలు విధించి కొన్ని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురికి కౌన్సిలింగ్ చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కె. సురేష్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


భువనగిరిలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 16న కార్మిక సమ్మె- గ్రామీణ బంద్‌కు సంబంధించిన సమ్మె పోస్టర్‌ను బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు కట్టు బానిసలాగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెబుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు ఉట్కూరి నారాయణరెడ్డి, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, నర్సింహ, పోలే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళ్లెదుటే భర్త మృతి

● డివైడర్‌ను ఢీకొన్న బైక్.. భార్యకు గాయాలు

మునగాల, ఫిబ్రవరి 7: బైక్ అదుపు తప్పి పడడంతో భార్య కళ్లెదుటే భర్త మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని మొద్దుల చెరువు సమీపంలో బుధవారం జరిగింది. ఎస్ఐ పి. లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం... మేళ్లచెరువు మండలం హేమ్లాతండాకు చెందిన పానుగోతు శ్రీను(45), భార్య మంగతితో కలిసి బైక్‌పై తన అత్తగారి ఊరు మోతె మండలం పాచ్య తండాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మొద్దుల చెరువు సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మంగతికి గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం 108లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రి తరలించారు. శ్రీను మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీను తమ్ముడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని మరొకరు

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని ఎల్‌బీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ పి. వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడుకు చెందిన మిడసనమెట్ల కృష్ణయ్య(51) మంగళవారం మధ్యాహ్నం బైక్‌పై నేరేడుచర్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మండల పరిధిలోని ఎల్బీనగర్ ఎస్ఎస్సీ కెనాల్ వద్ద నేరేడుచర్ల నుంచి వస్తున్న మరో ఢీకొన్నాయి. కృష్ణయ్య తలకు గాయాలు కావడంతో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కృష్ణయ్య భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏపీ మత్స్యకారులపై చర్యలు తీసుకోవాలి

నాగార్జునసాగర్, ఫిబ్రవరి7: ఏపీ ప్రాంతానికి చెందిన కొందరు మత్స్యకారులు తెలంగాణ వైపున ఉన్న సాగర్ జలాశయంలోకి వచ్చి మత్స్య సంపదను దోచుకుంటున్నారని తెలంగాణ మత్స్యకారుల సంఘం సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏపీ మత్స్యకారులు నిషేధిత రింగు అలివి వలలను ఉపయోగించి తెలంగాణ మత్స్యకారుల జీవనోపాధికి గండి కొడుతున్నారని పేర్కొన్నారు. మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగర్ జలాశయంలో సుమారు 50లక్షల చేప పిల్లలు విడుదల చేస్తుందని తెలిపారు. రింగు అలివి వలలతో మత్స్య సంపదను దోచుకుంటున్నారని ఎస్ఐ సంపత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు తాతరావు, అప్పలరాజు, విజయ్, యేసు, శ్రీను పాల్గొన్నారు.


ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న మత్స్యకారులు

తిర్మాలాపూర్‌లో పాడి గేదెల అపహరణ

తుర్కపల్లి, ఫిబ్రవరి 7: పశువుల పాకలోనుంచి ఐదు గేదెలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన దొనికెని పరశురాములు తన ఆరు పాడి గేదెలను పశువుల పాకలో సాయంత్రం కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారు జామున పరశురాములు పాలు పితికేందుకు తన వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లాడు. పశువుల పాకలో గేదెలు లేకపోవడంతో చుట్టు పక్కల వెతుకగా ఒక గేదె దొరికింది. ఐదు గేదెలు దొరక లేదు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పక్కా ప్రణాళికతో వచ్చి డీసీఎం వాహనంలో గేదెలను ఎత్తుకెళ్లినట్లు డీసీఎం వాహనం టైర్ల గుర్తులు ఉన్నాయని, డీసీఎంలో గేదెలను ఎక్కించే క్రమంలో ఓ గేదె తప్పించుకొని పారిపోవడం వల్లే ఆ గేదె దొరికినట్టు బాధిత రైతు తెలిపాడు. తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. తనకు రూ. 2.5లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

మూడు మేకలు అపహరణ.. పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని ఎల్ఐసీ కాలనీకి చెందిన పాత్లావత్ నందుకు చెందిన మూడు మేకలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించారు. నందుకు పది మేకలు ఉండగా మూడు మేకలు కనిపించకపోవడంతో దొంగలు అపహరించారని బాధితుడు బుధవారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మేకల విలువ సుమారు రూ.20వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

ఎస్‌బీఎం నిధులు పక్కదారి

● పలువురి ఖాతాలకు నిధులు... ఒక్కరి నుంచే రికవరి ● కేసు నుంచి తప్పించుకునేందుకు అక్రమార్కుల ప్రయత్నం

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 7: అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో కేంద్ర ప్రభుత్వ పథకం స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) ఖాతా నుంచి సుమారు రూ.8.67లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయి. ఈ తతంగం జరిగి ఏడాది అయినా పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అధికారులు గుర్తించలేదు. వివరాల్లోకి వెళ్తే నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని తునికినూతల గ్రామంలో ఎస్‌బీఎం నిధులు స్వాహా చేసిన ఘటన ఇటీవల ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ పంచాయతీకి చెందిన మల్టీపర్పస్ వర్కర్ పానుగోతు పాండు, సర్పంచ్ కుమారుడు కొర్ర హనుములు ఈ నిధుల స్వాహాలో కీలకపాత్ర పోషించి, తన సంతకాన్ని ఫోర్జరీ చేసి సుమారు రూ.8.67లక్షలు పది మంది బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ అయినట్లు పంచాయతీ కార్యదర్శి కీర్తి ఈ నెల 1న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడాదిన్నర క్రితమే నిధులు పక్కదారి

సుమారు ఏడాదిన్నర క్రితమే ఈ నిధులను సర్పంచ్ కుమారుడు కొర్ర హనుము, మల్టీపర్పస్ వర్కర్ పానుగోతు పాండులు సుమారు 18 చెక్కులతో స్థానిక సర్పంచ్, గ్రామ సమభావన సంఘబంధం లీడర్ సంతకాలను అడ్వాన్స్‌గా చెక్కులపై సంతకాలు చేయించుకొని, అనంతరం పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేయగా నిధులు ఆయన ఖాతాలో జమ అయినట్లు తెలుస్తోంది. గతంలో గ్రామంలో మరుగుదొడ్లు లేని సుమారు 75మంది గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోగా అందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీకి ఎస్‌బీఎం ఖాతాలో సుమారు రూ.8.70లక్షలు జమ అయ్యాయి. వీటిని అర్హులైన లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకున్న క్రమంలో ఒక్కొక్కరికి రూ.12వేలను అధికారులు చెక్కు రూపంలో అందించాల్సి ఉంటుంది. గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దడంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకునేలా స్థానిక అధికారులు, సర్పంచ్, ఇతర పాలకవర్గం పనిచేయాల్సి ఉంటుంది. ఎస్‌బీఎం ఖాతాలో సుమారు. రూ.8.70లక్షలు ఖాతాలో ఉన్నప్పటికీ వాటిని లబ్ధిదారులు వినియోగించుకునేలా గ్రౌండింగ్ చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా ఆ నిధులు బ్యాంకులోనే ఉన్నా యి. దీనిని ఆసరాగా తీసుకున్న సర్పంచ్ కుమారుడు హనుము, మల్టీపర్పస్ వర్కర్ పాండు కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి కొర్ర హనుము తన వ్యక్తిగత ఖాతాకు రూ.3.20లక్షలు, మల్టీపర్పస్ వర్కర్ పాండు ఖాతాకు రూ.2.81లక్షలు, నాగులు ఖాతాకు రూ.72వేలు, వంశీ ఖాతాకు రూ.74వేలు, దేవి, శ్రీరామ్, మునిలాల్, సేలి ఖాతాల్లోకి ఒక్కొక్కరికి రూ.24వేల చొప్పున, కోటేష్, లలితల ఖాతాలకు రూ.12వేల చొప్పున నగదును బదిలీ చేయించుకున్నారు. ఎస్‌బీఎం ఖాతా నుంచి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.12వేలు చెల్లించాల్సినప్పటికీ కొందరి ఖాతాలకే పెద్ద ఎత్తున నగదును బదిలీ చేయడంపై సంబంధిత బ్రాంచ్ మేనేజర్‌ను వివరణ అడగగా ఎస్‌బీఎం ఖాతాను నిర్వహిస్తున్న ముగ్గురు సంతకాలు సరిపోలడంతోనే తాము నగదును ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫర్ అయిన నగదును అక్రమార్కులు స్వయంగా బ్యాంకుకు వచ్చి డ్రా చేసుకొని వాడుకున్నారు. సుమారు ఏడాదిన్నర తర్వాత ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. దీంతో కొందరు అధికారుల సలహాతో మల్టీపర్పస్ వర్కర్ పాండు ఎస్‌బీఎం ఖాతాలో రూ.8.67లక్షలను ఇటీవల జమా చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్నంతటినీ తానే చేశానని సర్పంచ్ కుమారుడికి, ఇతరులకు సంబంధం లేదని ఒక లెటర్‌ను మల్టీపర్పస్ వర్కర్ పాండు సంబంధిత అధికారులకు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఏడాదిన్నర క్రితమే ఫోర్జరీతో నగదు బదిలీ చేశారు

గ్రామపంచాయతీకి సంబంధించి మూడు చెక్ బుక్కులో ఒకదాన్ని నా దగ్గర ఉంచుకొని మిగతా రెండింటిని గ్రామపంచాయతీ కార్యాలయంలోని బీరువాలో ఉంచాను. అయితే పాండు, హనుములు చెక్కులను తీసుకొని వాటిలో 18చెక్కుల ద్వారా ఎస్‌బీఎం ఖాతా నుంచి నిధులను డ్రా చేశారు. ఏడాదిన్నర తర్వాత వారం రోజుల క్రితమే ఆ విషయం నా దృష్టికి వచ్చింది. అందుకే పోలీసులకు ఫిర్యాదు చేశాను.

● కీర్తి, తునికినూతల గ్రామపంచాయతీ కార్యదర్శి.

వేసవికి ముందే నీటికి కటకట


పక్క గ్రామాల నుంచి ట్యాంకర్‌తో నీరు తెచ్చి గ్రామస్థులకు అందిస్తున్న న్యూబంజారాహిల్స్ గ్రామ పంచాయతీ సిబ్బంది

- అడుగంటిన భూగర్భజలాలు
- నిత్యావసరాలకు, తాగునీటికి అవస్థలు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 7: భూగర్భ జలాలు అడుగంటడంతో మండలంలోని రెండు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఆ గ్రామాల్లో తాగునీటి అవసరాలను తీర్చడానికి కుంటలో వేసి బోరు ఎండిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్, దుపహాడ్ శివారు అశోక్‌నగర్, న్యూబంజారహిల్స్ తండాలకు తాగునీరు అందించాడానికి 20సంవత్సరాల క్రితం దూపహాడ్ గ్రామానికి చెందిన ఇసుకబావికుంట చెరువులో రెండు స్కీం బోర్లను 200అడుగుల లోతున వేశారు.ఈ బోరుకు 5హెచ్‌పీ మోటర్లు అమర్చి పైపులద్వారా ఆయాగ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను నీటిని ఎక్కిస్తున్నారు. అక్కడి నుంచి ఇళ్లల్లోని నల్లాలకు నీటిని సరఫరా చేసి తాగునీటిని సరఫరా భూగర్భజలాలలు అడుగంటడంతో దూపహాడ్ గ్రామంలోని ఇసుకబావి కుంటల వేసిన బోరు ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన ఎండిపోయింది. దీంతో అప్పటినుంచి తాగునీటితో పాటు నిత్యవసరాల నీటికి ఈరెండు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడానికి అధికారులు ప్రయత్నించారు. ఈనీరు రోజూ కాకుండా నాలుగైదు రోజులకు రావడం,అది కూడా కొద్ది మోతాదులో వస్తున్నందున సరిపోక గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. బంజారహిల్స్ తండాకు చెందిన ట్రాక్టర్‌తో సమీప గ్రామాలకు వెళ్లి నీరు తెచ్చి అందిస్తున్నా గ్రామస్థుల అవసరాలకూ ఏమాత్రం సరిపోవడం లేదు.

జలజగడాలు..

సంవృద్ధిగా నీటి జలాలు ఉన్న తమ గ్రామానికి కిలోమీటరున్నరదూరంలో ఉన్న సీతమ్మతండా స్కీం బోరునుంచి తమ గ్రామానికి పైప్‌లైన్ వేసుకోవడానికి బంజారహిల్స్‌తండావాసులు వారంరోజుల క్రితం యత్నించారు. ఈ ప్రయత్నాలను సీతమ్మతండా గ్రామస్థులు అడ్డుకున్నారు. మా గ్రామానికే తాగునీరు సరిగా రావడంలేదు.. వచ్చే కొద్దిపాటి నీటిని మీ రు తరలించుకువెళితే, మాగ్రామానికి ఎలా? బంజారహిల్స్‌తండావాసులతో సీతమ్మతండా గ్రామస్థులు ఘర్షణ పడ్డారు. దీంతో పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

సమస్యను పరిష్కరించే బాధ్యత పంచాయతీలకు అప్పగించాం

దూపహాడ్, అశోక్‌నగర్, న్యూబంజారాహిల్స్ తండాలో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించింది.

- శ్రీనివాస్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

గ్రామ పంచాయతీల్లో ఒక్క పైసా నిధులు లేవు

ఈగ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించడానికి పంచాయతీల్లో ఒక్కపైసా నిధులు లేవు. నిధులు సమీకరించడానికి దాతలను వెదుకుతున్నాం. నిధులు సమీకరించిన భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉన్న చోట బోరు వేసి గ్రామస్థుల నీటి అవసరాలను తీర్చడానికి యత్నిస్తున్నాం.

- శ్రవణ్‌కుమార్, విజయ్‌కుమార్, దూపహాడ్, న్యూబంజరాహిల్ తండా గ్రామాల కార్యదర్శులు

గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో నీటి ఎద్దడి

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో నీటి ఎద్దడి నెలకొంది. ఇక్కడ 340 మంది విద్యార్థులు ఉండగా, అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. పాఠశాల, కళాశాలలో నీటి కొరత చుట్టుముట్టింది. పాఠశాల ఆవరణలో ఉన్న రెండు బోర్లు ఎండిపోయినందున నీటి కొరత ఏర్పడింది. దీంతో విద్యార్థులు చుట్టుపక్కల ఉన్న ఇళ్లల్లోకి వెళ్లి బకెట్లతో నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.


నీటి కోసం బకెట్లతో విద్యార్థులు

మరో భవనం కోసం వెదుకుతున్నాం

ఈ పాఠశాలలో విద్యార్థులకు సరిపడే గదులు లేవు. ఇప్పుడు నీటి సమస్య తలెత్తింది. తలెత్తిందని వారం కోసం బోరు వేయించిన నీళ్లు పడలేదు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించేందుకు యత్నిస్తున్నాం. అన్ని వసతులు ఉన్న భవనం కోసం వెదుకుతున్నాం.

- మరళి, ప్రిన్సిపాల్

బీసీ గణనపై బీజేపీ వైఖరి వెల్లడించాలి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 7: బీసీ గణనపై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరి వెల్లడించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్‌నాయుడు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పలు జాతీయ పార్టీలు బీసీ గణనకు అనుకూలంగా ప్రకటనలు చేయగా, బీజేపీ ప్రభుత్వం నేటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఈనెల 8న ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట నిర్వహించే బీసీల ధర్నాను, అదేవిధంగా ఈనెల 9వ తేదీన నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పేర్ల గిరియాదవ్, నరేష్, నాగరాజు, వేణు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి


తుంగతుర్తిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

తుంగతుర్తి, ఫిబ్రవరి 7: కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బిల్డింగ్ వర్కర్లు, గ్రామీణ హమాలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రభాకర్, రమేష్, దేవా, సతీష్, సుందర్, వెంకన్న, మల్లయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కోకన్వీనర్ దొడ్డ వెంకటయ్య కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన వామపక్ష రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేదరమెట్ల వెంకటేశ్వర అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాస్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, దేవరం వెంకటరెడ్డి, చందా చంద్రయ్య, ఎం.ముత్యాలు, నాగటి రాములు, వెంకన్న పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో సుదీర్ఘకాలం వైద్యరంగంలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు కోరారు. బుధవారం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి శంకుస్థాపనకు వచ్చిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నరసింహకు ఏఎన్ఎంలతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు రాధాకుమారి, గోపమ్మ, నీరజమ్మ, ధనలక్ష్మి, మంగమ్మ, వరలక్ష్మి, కల్పన, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతోనే మండలానికి సాగు, తాగు నీరు

పాలకవీడు, ఫిబ్రవరి7: భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని చివరి గ్రామాలైన జాన్‌పహాడ్ దర్గా, కోమటికుంట తదితర గ్రామాలకు సాగర్ ఎడమ కాల్వ ద్వారా సాగు, తాగు నీరు అందుతోందని ఎంపీపీ గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలో నీటి ఎద్దడి సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పదించి, ఎల్14, ఎల్10 కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు.

ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 7: ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు తక్షణమే నీటిని విడుదల చేయాని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నం పాపిరెడ్డి కోరారు. ఈ విషయన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం తీసుకువెళ్లినట్లు తెలిపారు. సాగర్ నుంచి పాలేరుకు వారం రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారని,ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కి నీటిని విడుదల చేసి తాగు, సాగు నీటికి ఇబ్బందులులేకుండా చూడాలన్నారు.

3.19లక్షలు పలికిన ప్రసాదాల విక్రయం హక్కులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 7: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని శంభులింగేశ్వర దేవస్థానంలో లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయం హక్కును రూ..3.19లక్షలకు గణపవరం గ్రామానికి చెందిన గాయం వినయ్‌రెడ్డి కైవశం చేసుకున్నట్లు ఆలయ ఈవో కొండారెడ్డి తెలిపారు. సరైన పాట రానందున కొబ్బరికాయల విక్రయ హక్కు వేలం పాటను నిలిపివేశామన్నారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో వానరాల బెడద


మునగాలో ఓ ఇంట్లో చొరబడిన కోతులు

మునగాల రూరల్, ఫిబ్రవరి 7: మండలంలో కోతుల బెడద ఎక్కువైంది కోతులు బృందాలుగా సంచరిస్తూ మహిళలు, పిల్లలు, వృద్ధులను గాయపరుస్తున్నాయి. మునగాల, నారాయణగూడెం, కలకోవ, కృష్ణానగర్, తాడ్వాయి, ముకుందాపురం, ఆకుపాముల, నారాయణగూడెం తదితర గ్రామాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లల్లోకి, దుకాణాల్లోని చొరబడి నానా హంగామా చేస్తున్నాయి. కోతుల బెడదతో చిన్నారుల పాఠశాలలకు వెళ్లాలన్నా భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కోతుల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా రంగారెడ్డి


చిల్లేపల్లి సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రంగారెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 7: మండలంలోని చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా గంట రంగారెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్ రంగారెడ్డికి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సంఘం సీఈవో నాగరాజు సమక్షంలో రంగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకటరెడ్డి, సంఘం డైరెక్టర్లు వల్లపురెడ్డి రమణారెడ్డి, వెంకయ్య, గంగరాజు, సైదులు, శ్రీను, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ చలసాని శ్రీనివాసరావు, కొడాలి భాస్కర్‌రావు, కట్టా రామారావు, సైదులు, అజయ్, సత్యనారాయణ, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చిల్లేపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గంటా రంగారెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బుధవారం నేరేడుచర్లలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకటరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బచ్చలకూరి ప్రకాష్, ఆకారపు వెంకటేశ్వర్లు, వల్లపరెడ్డి, నక్కా రమాదేవి, సైదానాయక్, పగిడి నవీన్ పాల్గొన్నారు.

అర్వపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా శ్రావణి

అర్వపల్లి, ఫిబ్రవరి 7: అర్వపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా టి.శ్రావణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను కాంగ్రెస్ మండల నాయకులు భైరబోయిన మహారాజు, కనుకు రేణుక, మామిడి స్వరాజ్యం, శ్రీను, మంగ, బింగి శ్రీకాంత్, మల్లయ్య సన్మానించారు.

ఎంపీడీవోగా దయాకర్‌యాదవ్

పాలకవీడు, ఫిబ్రవరి7: ఎంపీడీవోగా దయాకర్‌యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననన్నారు.

తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షురాలిగా మమత

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 7: తెలంగాణ కళావేదిక జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సూర్యాపేటకు చెందిన జూలూరి మమతను నియమించారు. ఈ మేరకు ఆ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, చెవిటి వెంకన్నయాదవ్, రాష్ట్ర అధ్యక్షులు కిరణ్‌మార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రక్త దానం చేసి చిన్నారుల ప్రాణాలు కాపాడండి

గరిడేపల్లి, ఫిబ్రవరి 7: రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలు కాపాడాలని గరిడేపల్లి యూత్ సభ్యులు కోరారు. హైదరాబాద్‌కు చెందిన తలసేమియా ట్రస్ట్ డాక్టర్లు రాజకుమార్, వినయ్‌కుమార్ పర్యవేక్షణలో గరిడేపల్లి యూత్ సభ్యుల అధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ శిబిరంలో 65ప్యాకెట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో గుండెపోగు నరేష్, రమణ, రెఘు, గరిడేపల్లి యూత్ సభ్యులు నకిరేకంటి సతీష్, కొత్తపల్లి రవి, చామకూరి హరీష్, పిట్ట రాజు, వినోద్, నాగరాజు, రవి, మచ్చరవి, కొత్తపల్లి పవన్, మైసయ్య, నాగార్జున, శేఖర్, శ్రీను, మధు, తులిమెల చంటి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

ఆ నియోజకవర్గాలు రెండు కళ్లులాంటివి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 7: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు తనకు రెండు కళ్లలాంటివని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదాడలో 100పడకల ఆసుపత్రి భవనం శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా మంత్రిని మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అన్ని గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే సాగు, తాగు నీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో ఎక్కడా రోడ్లు నిర్మించిన దాఖలాలు లేవన్నారు. రోడ్ల కోసం రూ.12కోట్లు మంజూరు చేయించామని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. మంత్రిని సన్మానించిన వారిలో ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, నాయకులు రేపూరి వెంకటాచారి, యర్ల సీతారాంరెడ్డి, నర్సిరెడ్డి, శరభయ్య తదితరులున్నారు.


కోదాడలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంత్రులకు కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం

హుజూర్‌నగర్: పట్టణంలో ఆసుపత్రి శంకుస్థాపనకు వచ్చిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మధ్యాహ్నం 11.45గంటలకు హెలీకాప్టర్ నుంచి దిగగానే కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాహుల్‌హెగ్డే, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాశ్‌తో పాటు మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, ఎంపీపీలు గూడెపు శ్రీను, పార్వతికొండానాయక్, పెండెం సుజాత, భూక్యా గోపాల్, కొట్టె పద్మసైదేశ్వరరావు తదితర నాయకులు స్వాగతం పలికారు. మైనార్టీ నేత షేక్ సైదా ఉత్తమ్‌కు దట్టీ కట్టారు. మంత్రులను మునిసిపల్ చైర్మన్ గెల్లి అర్చనరవి, ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు యరగాని నాగన్న, కుంట సైదులు గజమాలతో సన్మానించారు. హెలీప్యాడ్ నుంచి మంత్రులు కాన్వాయ్‌లో మెయిన్‌రోడ్డు, ఇందిరా సెంటర్, పాత బస్‌స్టేషన్ నుంచి 100పడకల ఆసుపత్రికి చేరుకున్నారు. రోగులతో మంత్రులు మాట్లాడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైద్యసేవలు, వైద్యుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆసుపత్రి కోసం అడిగిన పనులన్నీ చేయిస్తామని, వెంటనే అంచనాలు వేసి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సహచర మంత్రులైన దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు సమర్థవంతంగా పనిచేస్తూ తనకు అనేక సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు యరగాని నాగన్నగౌడ్, తన్నీరు మల్లికార్జున్‌రావు, దొంగరి వెంకటేశ్వర్లు, చావా కిరణ్మయి, సహదేవరావు, భాస్కర్, అమరబోయిన సతీష్, ఓరుగంటి నాగేశ్వరరావు, శంభయ్య, కోతి సంపత్‌రెడ్డి, దొంతగాని శ్రీను, శ్రావణ్, ఆదెర్ల శ్రీనివాస్‌రెడ్డి, నిజాముద్దీన్, అజీజ్‌పాషా, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, డీఎస్పీ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లో మంత్రులకు భారీ దండ వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మద్దిరాల, చిలుకూరు, అర్వపల్లి, మునగాల రూరల్, గరిడేపల్లి, ఫిబ్రవరి 7: పరిసరాల పరిశుభ్రతతోనే అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని పలువురు అధికారులు అన్నారు. పారిశుధ్య వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అధికారులు మాట్లాడారు.

● మద్దిరాల మండలం కేంద్రంలోని గోరెంట్ల గ్రామంలో మురుగు కాల్వలను తహసీల్దార్ అమీన్‌సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమురుగు కాల్వలో ఉన్న పూడిక తీయాలని, వీధుల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. అనంతరం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంగ, హెచ్ఎం శ్రీనివాస్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


● గ్రామాల్లో వీధులను పరిశుభ్రంగా ఉంచాలని చిలుకూరు ఎంపీడీవో ఈదయ్య సూచించారు. మండల కేంద్రంలో వీధులను ఆయన పరిశీలించి మాట్లాడారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

●పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అర్వపల్లి ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయాదవ్ అన్నారు. అర్వపల్లి మండలంలోని కుంచమర్తి గ్రామంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దోమల నివారణ కోసం మురుగు కాల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలునాయక్, నవీన్‌రెడ్డి, కొండల్, వెంకన్న, నాగరాణి, భాగ్యమ్మ, వీరస్వామి, లక్ష్మారెడ్డి, బలరాం, దోమలకొండ సింహాద్రి, నాగరాజు పాల్గొన్నారు.


మద్దిరాల మండలంలోని గోరెంట్ల గ్రామంలో మురుగు కాల్వను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

●మునగాల మండలంలోని రేపాల గ్రామాల్లో పారిశుధ్య పనులను మండల ప్రత్యేక అధికారి, జిల్లా యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటరెడ్డి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆసుపత్రి, ప్రాథమిక పాఠశాల, నర్సరీని తనిఖీ చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.ఆయన వెంట ఎంపీవో భూపాల్‌రెడ్డి ఉన్నారు.

గరిడేపల్లి: మండల కేంద్రంతో పాటు కాల్వపల్లి, సర్వారం తదితర గ్రామాల్లో రోడ్ల పరిశుభ్రతను ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించే పారిశుధ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్ర మంలో ప్రత్యేకాధికారి వనజ, కార్యదర్శి సురేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ రూరల్: పేదల సంక్షేమానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందిస్తున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, కమలాకర్, సుధారాణి, సంపత్‌రెడ్డి, రామ్‌గోపి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ఖమ్మం పట్టణంలో ఈ నెల 11, 12తేదీల్లో నిర్వహించే తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భిక్షం, దుర్గాప్రసాద్, రామనర్సయ్య కోరారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

నేరేడుచర్ల: పట్టణంలోని చింతబండ ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.4500 విలువైన మైక్ సెట్‌ను డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ కొణతం సీతారాంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గుంటి జ్యోతి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి జిలకర రామస్వామి, క్లబ్ ఉపాధ్యక్షుడు గుండా సత్యనారాయణ, సభ్యుడు విశ్వనాథం, ఉపాధ్యాయులు ప్రసాద్, ఆర్పీ జ్యోష్ణ వెంకరమణ తదితరులు పాల్గొన్నారు.

●నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న జడ్పీహెచ్ఎస్‌లో 27సంవత్సరాలు పనిచేసిన సిరికొండ రాములు వర్ధంతి సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పెన్నులను ఆయన కుమారుడు, కోడలు సిరికొండ అనిల్, భాగ్యలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనృసింహుని నిత్యకల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

● సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలని, ఆ వ్యాఖ్య లను వెనక్కి తీసుకోవాలని యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ చిలక లోకేష్ అన్నారు. మఠంపల్లి మండలంలోని పెదవీడు గ్రామంలో బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మేళ్లచెర్వు, కోదాడ రూరల్: మేళ్లచెర్వు మండలంలోని రేపూరి గ్రామంలో ఉన్న వేణుగోపాల, సిద్దేశ్వర, ఆంజనేయ, రంగనాయకస్వామి ఆలయాలకు, చింతలపాలెం మండలంలోని చింత్రియాల గ్రామంలో ఉన్న వేణుగోపాల, ఆంజనేయ దేవస్థానాలు, అడ్లూరు గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం, వెల్లటూరు గ్రామంలో ఉన్న పాపనాశేశ్వర దేవస్థానానికి నూతన ధర్మకర్తల నియామకానికి దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఆసక్తి ఉన్నవారు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఈవో కొండారెడ్డి, లక్ష్మీనారాయణ తెలిపారు.

● కోదాడ మండలంలోని తమ్మరబండపాలెం గ్రామంలో ఉన్న దేవల్‌బాలాజీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధర్మకర్తల నియామకానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో తుమ్మల వెంకటచలపతి కోరారు.

కోదాడ రూరల్: రైతుల సమస్యలే ఇతివృత్తంగా వెబ్ సినిమా నిర్మించడం అభినందనీయమని ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య అన్నారు. శ్రీనివాస ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మించిన 'మనస్ఫూర్తిగా' వెబ్ మూవీ ఆడియో పాటలను మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నటీనటులు సంపెట వెంకట్, కందిబండ ఉపేందర్‌రావు, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలోని బిక్కుమళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గునగంటి లక్ష్మయ్య, కప్పల బిక్షం ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను కాంగ్రెస్ మండల నాయకుడు గంధసిరి భద్రాచలంగౌడ్ పరామర్శించి, 25కిలోల చొప్పున బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బోడపట్ల నరేష్, గునగంటి రాములు పాల్గొన్నారు.

● నూతన్‌కల్ మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకురాలు రమణమ్మ తల్లి నకిరేకంటి తిరుపతమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, ఆకారపు రుక్కమ్మ, చింతా బాబు, గంటా సుదర్శన్, కూరపాటి జగదీష్, కనుక జానయ్య, స్వామి నివాళులర్పించారు.

మద్దిరాల: బైకులను నడిపేవారు హెల్మెంట్ ధరించాలని ఎస్ఐ మధునాయుడు కోరారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగయ్య, పోలీస్ సిబ్బంది వీరసోములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: తమకు పాల బిల్లులను త్వరగా చెల్లించాలని పాడి రైతులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని తొండ గ్రామంలో పలువురు రైతులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల కోడ్‌కు ముందు విజయ డైరీ పాల బిల్లులు నెలలో రెండు సార్లు వచ్చేవని, ఎన్నికలు ముగిసిన తర్వాత నెల రోజులు గడిచినా బిల్లులు రాలేదన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలి కోరారు. కార్యక్రమంలో పాడి రైతులు జంపాల ఉపేందర్, బాషమల్ల మల్లేష్, బండారి లింగయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి: వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ మహేందర్‌నాథ్ కోరారు. అర్వపల్లి మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో భైరబోయిన మహారాజు, ఎర్ర నర్సయ్య, ఎన్.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.